ప్రజాశక్తి
ఆదివారం 9 ఏప్రిల్ 2023 5 అనంతపురం

రైతన్నతో నారా లోకేష్‌లో...

పోలీస్ బాస్‌ల బదిలీలు

◆ డిఐజి, ఇద్దరు ఎస్పీలకు స్థాన చలనం ◆ డిఐజి రవిప్రకాశ్ స్థానంలో అమ్మిరెడ్డి

◆ అనంతకు కె.శ్రీనివాసరావు ◆ సత్యసాయికి ఎస్‌వి.మాధవరెడ్డి

అనంతపురం ఎస్పీ... కె.శ్రీనివాసరావు

సత్యసాయి జిల్లా ఎస్పీ... ఎస్‌వి.మాధవరెడ్డి

ప్రజాశకి-అనంతపురం ప్రతినిధి, గార్లదిన్నె

రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్ల బదిలీలు జరిగిన వెంటనే పోలీసు ఉన్నతాధికారుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం రేంజ్ డిఐజితోపాటు అనంతపురం, పుట్టపర్తి జిల్లాల ఎస్పీలు బదిలీ అయ్యారు. అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాశ్‌ను సెబ్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్‌గా బదిలీ అయ్యారు. ఆ స్థానంలోకి ఎఐజి డిఐజిగానున్న ఆర్‌ఎన్.అమ్మిరెడ్డిని నియమించారు. అనంతపురం ఎస్పీగానున్న ఫక్కీరప్పను సిఐడి ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో కె.శ్రీనివాసరావును నియమించారు. పుట్టపర్తి ఎస్పీగానున్న రాహుల్‌దేవ్ శర్మను ఐదవ బెటాలియన్ కమాండెంట్‌గా నియమించారు. ఈ స్థానంలో ఎస్‌వి.మాధవరెడ్డిని పుట్టపర్తి ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రూపువన్ ఆఫీసర్‌గా చేరి డిఐజిగా ఆర్‌ఎన్.అమ్మిరెడ్డి

ఆర్‌ఎన్.అమ్మిరెడ్డి 2001లో గ్రూపు వన్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరారు. తిరుపతి అర్బన్ అడిషనల్ ఎస్పీగానూ, గుంటూరు విజిలెన్సు ఎస్పీగానూ పనిచేశారు. 2009లో ఐపిఎస్ కన్‌ఫర్డు అయిన తరువాత శ్రీకాకుళం ఎస్పీగానూ, గుంటూరు అర్బన్ ఎస్పీగానూ పనిచేశారు. ప్రస్తుతం ఎఐజి లా అండ్ ఆర్డర్‌లో పనిచేస్తున్నారు. ఆయన్ను అనంతపురం రేంజ్ డిఐజిగా ప్రభుత్వం ఇప్పుడు నియమించింది.

అనంతపురం ఎస్పీగా కె.శ్రీనివాసరావు

అనంతపురం జిల్లా ఎస్పీగా కె.శ్రీనివాసరావు నియమితులయ్యారు. గ్రూపు ఆఫీసర్‌గా పోలీసు శాఖలో చేరిన శ్రీనివాసరావు శ్రీకాకుళం సెబ్ ఎస్పీగానూ, విజయవాడ అసిస్టెంట్ కమిషనర్‌గానూ పనిచేశారు. వెయింటింగ్‌లో ఉన్న ఆయన్ను ఇప్పుడు అనంతపురం జిల్లా ఎస్పీగా నియమించారు.

పుట్టపర్తి ఎస్పీగా ఎస్‌వి.మాధవరెడ్డి

2010 గ్రూపు వన్ అధికారిగా ఉద్యోగంలో చేరిన ఎస్‌వి.మాధవరెడ్డి పుట్టపర్తి ఎస్పీగా నియమితులయ్యారు. ఫారెస్టు రేంజ్ ఆఫీసర్‌గా విధుల్లోకి మొదట చేరారు. ఆ తరువాత డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫీసర్‌గా నిర్మల్, కర్నూలు జిల్లా ఆత్మకూరు డీఎస్పీగా వచ్చారు. 2018లో అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారిగానూ పనిచేశారు. ప్రస్తుతం ఆయన వెయిటింగ్‌లోనున్నారు. ప్రస్తుతం పుట్టపర్తి ఎస్పీగా నియమితులయ్యారు.

రైతులకు తోడుగా ఉంటాం

◆ అన్నదాతలను విస్మరించిన వైసిపి
◆ యువగళం పాదయాత్రలో నారా లోకేష్
◆ జంబలదిన్నెలో రైతులతో ముఖాముఖి
◆ 64వ రోజ ముగిసిన పాదయాత్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతుతో మాట్లాడుతున్న నారా లోకేష్

టిడిపి అధికారంలోకి రాగానే అన్ని విధాలా వారికి తోడుగా ఉంటామని, వ్యవసాయానికి సాయం అందిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీనిచ్చారు. యువగళం పాదయాత్ర 64వ రోజు శనివారం నాడు పాదయాత్రకు విరామం ఇచ్చారు. గార్లదిన్నె మండలం జంబులదిన్నె వద్ద 'రైతన్నతో లోకేశ్' పేరుతో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌కెయు ప్రొఫెసర్ రాంప్రసాద్ హోస్టుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు అడిగిన పలు ప్రశ్నాలకు లోకేష్ సమాధానం చెప్పారు. రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో నారా లోకేష్ వైసిపి ప్రభుత్వ వైఫల్యాలతోపాటు, తాము అధికారంలోకి వస్తే తీసుకోబోయే చర్యలను వివరించారు. వైసిపి అధికారంలోకి రాక ముందు అంటే 2019 కంటే ముందు తలసరి రైతు రుణం రూ.70 వేలు ఉంటే ఇప్పుడు అది రూ.2.50 లక్షలకు చేరిందన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెబుతున్న వైసిపి ప్రభుత్వ మాటలు ఒట్టి బూటకమన్నారు. పంటలబీమాను ప్రభుత్వమే కంపెనీని స్థాపించి ప్రకృతి వైపరిత్యాలతో పంటనష్టపోయిన రైతులను ఆదుకుంటమని చెబుతోంది, కాని ఆచరణలో అది ఎక్కడా అమలు జరగలేదన్నారు. అనంతపురం జిల్లాలో ఇటీవలి కాలంలో తుఫానుతో ఉద్యానవన రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. వారిని ఆదుకునే అంశంపై ఇప్పటి వరకు నిర్దిష్టమైన ప్రకటన కూడా చేయలేదని విమర్శించారు. పంటనష్ట పరిహారం చెల్లించే విషయంలోనూ ఈ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. వైసిపికి అనుకూలంగానున్న కొద్ది మందికి పరిహారం ఇచ్చిన తక్కిన వారికివ్వడం లేదని విమర్శించారు. రైతు ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మూడవ స్థానంలో ఉందన్నారు. కౌలు రైతు ఆత్మహత్యల్లో అయితే రెండవ స్థానంలో ఉందన్నారు. కౌలు రైతులను ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరిసోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సాధారణ రైతులతో సమానంగా కౌలు రైతులను ఆదుకుంటుందని భరోసానిచ్చారు. రైతులను ఆదుకుంటామని ఈ ప్రభుత్త్వం ఆర్భాటంగా రైతు భరోసా కేంద్రాలు ప్రారంభించిందని గుర్తు చేశారు. తాను పాదయాత్ర చేసిన ఇన్ని రోజుల్లో ఎక్కడా రైతు భరోసా కేంద్రం తెరచి ఉన్న దాఖలాల్లేవని అన్నారు. మద్యం దుకాణాలు మాత్రం ఎప్పుడూ తెరచి ఉంటాయని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం వస్తే రైతులను ఏ రకంగా ఆదుకుంటారని రైతులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలను పెంచి పెట్టుబడి ఖర్చులు తగ్గిస్తామని, మార్కెటింగ్‌ను అనుసంధానం చేసి గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు చేపడామన్నారు. ఉద్యావన పంటలు అధికంగానున్న చోట ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తాము అధికారంలోకి ఉండగా రూ.11 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టినట్టు వివరించారు. వీరు వచ్చాక బిందు, తుంపెర సేద్యాన్ని అటకెక్కించారని విమర్శించారు. టిడిపి హయాంలో పెద్దఎత్తున బిందు,తుంపెర సేద్య పరికరాలను సబ్సిడీకి అందించామని, రాబోయే రోజుల్లోనూ ఇది కొనసాగుతుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమ అభివృద్ధికి గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ మంత్రుల కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి, బండారు శ్రావణి, ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నర్సానాయుడుతోపాటు వివిధ నియోజకవర్గాల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

కాపు సవాళ్లను స్వీకరిస్తున్నా..

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి విసిరిన సవాలును తాను మనస్ఫూర్తిగా స్వీకరిస్తున్నట్లు మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం ఆయన వీడియో ప్రకటన విడుదల చేశారు. గతంలో ఐదేళ్లలో తాను రాయదుర్గం ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి, కాపు నాలుగేళ్ల పనితీరుపై చర్చించడానికి ఎప్పుడు ఏ గ్రామానికి రావాలో చెప్పాలని కాపు రామచంద్రారెడ్డికి ప్రతి సవాల్ విసిరారు. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో కనేకల్లు మండలం గోపులాపురంలో అభివృద్ధిపై చర్చకు రమ్మని, తీరా తాను వేలాది మందితో వస్తానని పోలీసులను బెదిరించి చర్చ జరగకుండా అడ్డుపడింది మర్చిపోయావా అంటూ కాలవ గుర్తు చేశారు. గతంలో మాదిరి కాకుండా ఎవరినీ వెంటబెట్టుకోకుండా ఇద్దరమే వెళదామన్నారు. అవసరమనుకుంటే కాపు అతని సెక్యూరిటీని వెంట తెచ్చుకోవచ్చన్నారు. తాను మాత్రం ఒక్కడినే వస్తానని కాలవ స్పష్టం చేశారు. ఏ గ్రామంలోనైనా, ఏవీధిలోనైనా ప్రజల మధ్య అభివృద్ధి గురించి చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని కాలవ పునరుద్ఘాటించారు. చిత్తశుద్ధితో విసిరిన సవాలును అమలుచేయడానికి ముందుకు రావాలని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి కాలవ సూచించారు. నియోజకవర్గంలో మొదటి బూత్ మలపనగుడికి పోదామా? నీ అక్రమాలకు నిలయమైన క్రషర్లు, క్వారీలు ఉన్న నేమకల్లు గ్రామానికి వెళ్దామా అని సవాల్ విసిరారు. అభివృద్ధిపై చర్చకు తేదీని, గ్రామాన్ని ఎంపిక చేసే అవకాశాన్ని కూడా ఎమ్మెల్యే రామచంద్రారెడ్డికే ఇస్తున్నానని, దీనిపై గట్టిగా నిలబడాలన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్ర ఉన్నందున, ఏప్రిల్ 13వ తేదీ తర్వాత కాపు నిర్ణయించిన తేదీకి తాను సిద్ధంగా ఉన్నానని కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

సర్వే చేయించి చిత్తశుద్ధి నిరూపించుకోండి

◆ వైసిపి అక్రమాలను ఎండగట్టేందుకే యువగళం పాదయాత్ర

◆ టిడిపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ధర్మవరం చెరువుకు అనుకుని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గుర్రాల కోట నిర్మించుకున్న భూమి కొనుగోలు చేసిందా..? ఆక్రమించుకున్నదా.? అన్నది నిజాయితీగా సర్వే చేయిస్తే తెలుస్తుందని టిడిపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. శనివారం ఉదయం అనంతపురం నగరం అరవింద నగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూ ఆక్రమణపై తాము ఆధారాలతో సహా వాస్తవాలు వెల్లడించామన్నారు. దీనిని జీర్ణించుకోలేక యువగళం పాదయాత్ర, యువనేత నారా లోకేష్ నడకపై వ్యంగ్యంగా విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి అక్రమాలను ఎండగట్టేందుకే నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేస్తున్నారని చెప్పారు. ధర్మవరం జరుగుతున్న అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు కేతిరెడ్డి ఇలా నీచరాజకీయాలు చేస్తున్నారని చెప్పారు. గుర్రాలకోటలో మ్యాప్ ప్రకారం భూమి ఉన్నట్లయితే మిగతా భూమి ఎవరిదో అన్న విషయమైన ప్రజలకు తెలపాలన్నారు. బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే పదవిలో ఉన్న ఆయన వాస్తవాలను ప్రజలకు తెలియజేసి నిజాయతీని నిరూపించుకోవాలన్నారు. ఆక్రమిత భూమి జి.సూర్యనారాయణ, అలియాస్ మేడాపురం సూరి అనే వ్యక్తిది అంటున్నారని, సదరు సూరి అనే వ్యక్తి ఎమ్మెల్యేకు అత్యంత ఆప్తుడన్న విషయం ధర్మవరం నియోజకవర్గం ప్రజలందరికీ తెలుసన్నారు. బస్టాండ్ దగ్గర బ్రాహ్మణుల భూమి వివాదంలో మేడాపురం సూరి ఉన్నది నిజం కాదా అన్నారు. అక్రమాలు చేశారంటూ ప్రశ్నించిన వారిపై లేనిపోని అవాకులు, చవాకులు చేస్తే సహించేది లేదన్నారు. తాను ధర్మవరం వస్తే హింస, హత్యలు, దాడులు పెరుగుతాయని, కత్తులు, బాంబుల సంస్కృతి పునరావృతం అవుతుందంటూ కేతిరెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. రాప్తాడులోనూ ఇదే పంతాతో తమపై ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా పరిటాల కుటుంబం అంటే జిల్లా ప్రజలు అందరికీ తెలుసుకున్నారు. అక్రమాలకు పాల్పడిన వారికి ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా..

ఒకరు మృతి, నలుగురికి గాయాలు

ప్రజాశక్తి -ఉరవకొండ

కూలీలను తీసుకెళుతున్న ఆటో బోల్తాపడడంతో ఒకరు మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన ఉరవకొండ పట్టణ శివారులో శనివారం చోటుచేసుకుంది. ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం పరిధిలోని పిసి ప్యాపిలి గ్రామానికి చెందిన 16 మంది కూలీలు మిర్చిపంట కోయడానికి శనివారం ఉదయం ఆటోలో విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి బయలుదేరారు. ఉరవకొండ సమీపంలో రాయంపల్లి చెక్ పోస్ట్ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న గంగన్న (60) మృతిచెందాడు. మల్లమ్మ (55), పెన్నక్క (56), చాకలి అంజనమ్మ (50), కుమారి (30) లు తీవ్రంగా గాయపడ్డారు. మరో 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వీరందరినీ హుటాహుటిన ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించించారు. పరిస్థితి విషమంగా ఉన్న నలుగురిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉరవకొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గంగన్న (60) కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయం కింద రూ.లక్ష ఇవ్వడంతో పాటు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఉరవకొండ సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. వారు ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను, మృతి చెందిన గంగన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్థానికంగా కూలి పనులు కల్పించకపోవడం వల్లే ప్రమాదానికి గురై కూలీలు మరణించారన్నారు. గ్రామాల్లో కూలి పనులు లేక కుటుంబాలను పోషించడానికి ఏమి చేయాలో దిక్కుతోచక ఆటోలలో ఇతర గ్రామాలకు పనుల కోసం వెళ్లాల్సిన పరిస్థితులు జిల్లా వ్యాప్తంగా నెలకొన్నాయన్నారు. కూలీలు వెళ్తుతున్న ఆటోలు, ట్రాక్టర్లు ప్రమాదాలకు గురవుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన గంగన్న కుటుంబంతో పాటు క్షతగాత్రులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

క్షతగాత్రులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఆటో బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన వారిని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. మృతి చెందిన గంగన్న కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందే విధంగా కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, పిసి ప్యాపిలి నాయకులు కృష్ణ, భీమప్ప, వీరా, రమేష్ తదితరులు ఉన్నారు.

ఉరవకొండ రోడ్డు ప్రమాద కూలీలను ఆదుకోండి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

అనంతపురం కలెక్టరేట్ : ఉరవకొండ మండలం ప్యాపిలి కొత్తకోట ఉంచి పాల్తూరు గ్రామానికి వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కూలీల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉరవకొండ వద్ద జరిగిన ప్రమాదంలో కూలీ గంగన్న అక్కడికక్కడే మృతి చెందగా మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారన్నారు. మృతి చెందిన కూలీ కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలన్నారు. గాయపడిన కూలీల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ కూలీలకు సొంత గ్రామాల్లో పనులు లేక సుదూరు ప్రాంతాలకు ఆటోల్లో ఎక్కువ మంది ప్రయాణం చేయడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గతంలో పామిడి, గుత్తి, వైటి.చెరువు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 14 మంది మరణంచారన్నారు. 24 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ఇలా వరుసగా ప్రమాదాలు జరుగుతున్న అధికారుల్లో చలనం లేదన్నారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు కల్పిస్తే కూలీలు పక్క ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని గ్రామాల్లో విరివిగా ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆదర్శ రైతులకు సన్మానం

ఉరవకొండ : ఆదర్శ యువ రైతు దంపతులు అమృత్ సాగర్, అమృతవాణిలను జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ వజ్రకరూరు మండల పరిధిలోని గంజిగుంట గ్రామానికి చెందిన యువరైతు అమృతసాగర్, అమృతవాణి దంపతులు వారికి ఉన్న పది ఎకరాల పొలంలో బొప్పాయి, దానిమ్మ, చెరకు, అల్లనేరేడు, మిరప, అనప, వేరుశనగ పంటలతోపాటు కూరగాయలను సాగుచేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం రైతు దంపతులు మాట్లాడుతూ జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు తమ పొలంలో పంటలను పరిశీలిస్తూ పరిష్కార మార్గాలు చూపే వారన్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు కృషిచేసిన జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసుతోపాటు ఫౌండేషన్ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ సభ్యులు రమేష్, సురేంద్ర, రైతులు పాల్గొన్నారు.

మహిళా రైతులను సన్మానిస్తున్న దృశ్యం

ఉరవకొండ అభివృద్ధిపై మాట్లాడే అర్హత టిడిపికి లేదు

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత టిడిపితో పాటు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు లేదని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పయ్యావుల కేశవ్ వల్ల ఉరవకొండ నియోజకవర్గానికి ఒరిగింది ఏమీలేదని ఎద్దేవా చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ చేసిన వ్యాఖ్యలను శివరామిరెడ్డి తప్పుబట్టారు. రాజకీయ అవగాహన లేని నారా లోకేష్ ద్వారా పయ్యావుల కేశవ్ అబద్దాలను అందంగా చెప్పించారన్నారు. ఉరవకొండలో జరిగిన అభివృద్ధి టిడిపి హయాంలోనే చేశామంటూ చెప్పుకు రావడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు అనిపించిందని ఎద్దేవా చేశారు. హంద్రీనీవా ద్వారా ఈ ప్రాంతానికి నీళ్లు తీసుకురావడానికి వైఎస్.రాజశేఖర్ రెడ్డి కారణమన్నారు. రూ.86 కోట్లతో పిఎబిఆర్ డ్యామ్ నుండి నియోజకవర్గానికి తాగునీరు మంజూరు చేయించామన్నారు. 2012లో తాను ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉరవకొండలో ప్రభుత్వ ఆసుపత్రిని మంజూరు చేయించానన్నారు. దాన్ని తానే మంజూరు చేయించానని కేశవ్ చెప్పడం తప్పని అన్నారు. ఉరవకొండ నియోజక వర్గంలోని పలు మండలాల్లో మండల కార్యాలయాలు, గురుకుల పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాలలు, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటిఐ కళాశాల, పాఠశాలలకు సొంత భవనాలు, అదనపు తరగతి గదులు, ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు తాను స్వయంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి మంజూరు చేయించినవే అన్నారు. దీనిపై కేశవ్ బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. జగన్మోహన్‌రెడ్డి మానస పుత్రికలైన గ్రామా సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, నాడు-నేడు పథకాల ద్వారా నియోజకవర్గంలో రూపురేఖలు మారిన పాఠశాలల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సెల్ఫీలు దిగి తమ పచ్చమీడియా, సోషల్ మీడియాలో ప్రచురించే దమ్ముందా అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే నారా లోకేష్ అసత్య ప్రచారాలకు తెరతీస్తున్నారని తెలిపారు. కార్యక్రమములో మాజీ డిసిఎంఎస్. ఛైర్మన్ సోమర జయచంద్ర నాయుడు, విడపనకల్ మాజీ ఎంపీపీ రమణారెడ్డి, ఉరవకొండ మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ రమణ యాదవ్, కొనకొండ్ల సర్పంచి ఇందిరమ్మ, గంజికుంట సర్పంచి జయేంద్ర రెడ్డి, జరుట్లరాంపురం సర్పంచి తిరుపాల్ యాదవ్,ేంణుమాకులపల్లి సర్పంచి రామాంజినేయులు, తత్రకల్లు సర్పంచి కిష్టప్ప, షేక్షానుపల్లి సర్పంచి లింగన్న, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచి లతిత, ఎంపిపి

అభివృద్ధి పనుల పరిశీలన

ఉరవకొండ : స్థానిక భగవాన్ రిక్రియేషన్ క్లబ్ సమీపం నుంచి సమ్మనకుంట వరకు జరుగుతున్న డ్రెయినేజీ, సైడ్ వాల్ నిర్మాణ పనులను సర్పంచి లలిత, ఎంపీపీ చంద్రమ్మ స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. పనులను నాణ్యతతో వేగవంతంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో కురుబ రాష్ట్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోవిందు, పిఎసిఎస్ ఛైర్మన్ షేక్షావలి, డైరెక్టర్ ప్రసాద్, మాజీ ఎంపీపీ ఎర్రిస్వామి, పార్టీ పంచాయతీరాజ్ అధ్యక్షులు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

In the Court of the IInd Addl. Junior Civil Judge: Anantapuramu
O.S.No.82/2020
Between:
IDBI Bank, Rep.by its Branch Head Anantapuramu ...Plaintiff
And
Shaik Jaffer Vali ...Defendant
To,
Shaik Jaffer Vali S/o Shaik Mohammed Saheb R/at D.No.19-3-250, Bhavani Nagar, Anantapuramu.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 11-05-2023 వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
చిలమకూరి శ్రీనివాసులు, వాదిపరం వకీలు
అనంతపురం, సెల్:9490122008.

In the Court of the Ist Addl. Junior Civil Judge: Anantapuramu
O.S.No.359/2020
Between:
Canara Bank Rep.by its authorized Officer, Manager and Authorised Officer, Main Branch, Anantapuramu ...Plaintiff
And
Penakalapadu Dhanunjaya ...Defendant
Notice to Defendant
To,
Penakalapadu Dhanunjaya S/o P.Ramanjaneyulu, R/o D.No.3-46, Muntimadugu Kothapalli Village, Garladinne Mandal, Anantapur Dist.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 19-04-2023 వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
చిలమకూరి శ్రీనివాసులు, వాదిపరం వకీలు
అనంతపురం, సెల్:9490122008.

In the Court of the IInd Special Megistrate: Anantapuramu
O.S.No.321/2020
Between:
Nutanapati Ramulamma @ Ramulamma ...Plaintiff
And
K.Nagendra ...Defendant
Notice to Defendant
To,
K.Nagendra S/o K.Nallappa, Residing at Illuru Village, Garladinne Mandal, Anantapur Dist.
పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 17-04-2023 వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
బండారు విశ్వనాథ్, అడ్వకేట్
రామ్‌నగర్, అనంతపురం, సెల్:9441012298.

In the Court of the Ist Addl. Junior Civil Judge: Anantapuramu
E.P.No.433/2019 in O.S.No.81/2019
1.Penukonda Mallikarjuna
2.Penukonda Nagaraju ...Decree Holders
And
Sunkamma ...Judgement Debtor
Notice to J.Dr
To,
Sunkamma W/o C.V. Subba Rao, D/o Penugonda Naganna, Residing at D.No.15/818, Behind Taluk Office, Tadipatri Town and Mandal, Anantapuramu Dist.
పై నెంబరు కేసులో జె.డిఆర్ అయిన మీ హాజరు నిమిత్తం 08-05-2023 వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
Khedri Venkata Ramana, Advocate
Ananthapuramu, Cell:9502817580.

In the Court of the IInd Addl. Junior Civil Judge (Mobile): Anantapuramu
E.P.No.20/2020 in O.S.No.632/2019
Gogula Sreenivasulu ...D.Hr
And
Maramreddy Rajasekhar Reddy ...J.Dr
Notice to J.Dr
To,
Maramreddy Rajasekhar Reddy S/o M.Venkata Subba Reddy Working at Administrations Department (P&A) Ultratech Cement Factory, Employee No.670303, Bhogasamudram (Village), Tadipathri (Mandal), Anantapuramu Dist.
పై జె.డిఆర్ హాజరు నిమిత్తము వాయిదా 20-04-2023 వ తేదిన వాయిదా ఉన్నది. ఆ రోజు ఉదయం 10.30 గంIIలకు పై కోర్టులో హాజరుకావలెను. అట్లు హాజరుకానిచో కేసును మీ పరోక్షముగా తీర్మానించబడును.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
N.P. Sreenivasulu, Advocate
Ananthapuramu.

మహారాజశ్రీ పెనుకొండ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No.60/2017
Between:
వి.ఎర్రిస్వామి ...వాది
మరియు
1.ఎ.హేమలత 2.ఎ.ఉమా ...ప్రతివాదులు
To,
ఎ.ఉమా D/o ఎ.రామానాయుడు, డోర్‌నెం.1/60-సి, పెద్దిపల్లి, రొద్దము మండలము Now D.No.11-1-309, 1st Cross, పార్కుదగ్గర, అరవిందనగరు, అనంతపురం.
నోటీసు
ఇందుమూలముగా పై దావాలో రెండవ ప్రతివాది ఐన నీకు తెలుపునది ఏమనగా, పై దావాలోని వాది నీ మీద అగ్రిమెంటు రిజిస్ట్రేషన్ కొరకు పై కోర్టులో దావా చేసియున్నాడని సదరు దావా నీ హాజరుకు గాను 13-04-2023 తేదికి వాయిదా యున్నదనియు, పై తెల్పిన తేదీన నీవు పై కోర్టువారి ఎదుట ఉదయం 10.30 గంIIలకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలయుననియు లేని పక్షములో పై దావా నీ పరోక్షము నందు తీర్మానించబడుననియు నీకు తెలుపడమైనది.
(కోర్టువారి ఆదేశాల మేరకు)
సి.ఆర్. నాగార్జున, ఎం.ఏ., ఎం.ఎల్.
వాదిపరం వకీలు, పెనుకొండ.

కాక రేపుతున్న లోకేష్ యాత్ర..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర జిల్లాలో రాజకీయ కాకు పుట్టిస్తోంది. గత నెలలో జిల్లాలో ప్రారంభమైన యాత్ర ఇంకా కొనసాగుతూనే, ఈ యాత్ర సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూనే స్థానిక సమస్యలు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులపై అనేక ఆరోపణలు చేస్తూపోతున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో పాదయాత్ర సాగుతున్న సమయంలో అధికార పార్టీ నుంచి ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది రాజకీయ వేడిని రాజేస్తోంది. పుట్టపర్తిలో ప్రారంభమైన ఆరోపణ, ప్రత్యారోపణల పర్వం ఇప్పుడు శింగమల వరకు సాగుతూనే ఉంది. పుట్టపర్తిలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిల మధ్య తీవ్ర స్థాయిలోనే వాదోపవాదనలు జరిగాయి. సత్యమ్మ గుడివద్ద ప్రమాణాలకు సిద్ధపడటంతో రెండు గ్రూపులు మోహరించుకుని ఘర్షణకు సైతం దిగారు. ఆ తరువాత రాప్తాడు జాకీ పరిశ్రమ తరలిపోవడంపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. టిడిపి ఆరోపణలకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ప్రత్యారోపణలు చేస్తున్నారు. జాకీ పరిశ్రమకు తక్కువ ధరకు భూములు కట్టబెట్టి డబ్బులు కాజేసారని ఆరోపిస్తున్నారు. దీనికి వైసిపి ఎమ్మెల్యే బెదిరింపులతోనే జాకీ పరిశ్రమ రాకుండాపోయిందని టిడిపి ఆరోపిస్తోంది. అదే సమయంలో ధర్మవరంలో చెరువు కట్ట ఆనుకుని యర్రగుట్టను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కబ్జా చేశారని ఆరోపించడమే కాకుండా గూగుల్ మ్యాప్ విడుదల చేశారు. దీంతోపాటు నియోజకవర్గంలో పలుచోట్ల భూములు కబ్జా చేశారని ఆరోపిస్తూ మరో ప్రకటన చేశారు. దీనిపై ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ప్రత్యారోపణలకు దిగారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తాను ఆ భూములు కొనుగోలు చేసినట్లు వివరణిస్తున్నారు. అనంతపురం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్లో స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కమీషన్లు తీసుకున్నారంటూ ఆరోపణలు చేశారు. దీనిపై నగర మేయరు వసీం, ఇతర నేతలతోపాటు, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రతిస్పందించారు. నిరాధారమైన ఆరోపణలు చేయడాన్ని కొట్టిపారేశారు. ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాల్లోనూ అక్కడి వైసిపి నాయకులు భూకబ్జాలకు పాల్పడ్డారని నారా లోకేష్ ఆరోపించారు. వీటిని ఆ పార్టీ నాయకులు తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రకంగా పాదయాత్ర సాగిన క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులపై లోకేశ్ చేస్తున్న ఆరోపణలతో రాజకీయ వేడి రాజుకుంటోంది. మరోవైపు లోకేశ్ పాదయాత్ర మర్తాడుతో 800 కిలోమీర్లు పూర్తయింది. ఈ సందర్భంగా జరిగిన పాదయాత్రలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పాల్గొని మద్దతునిచ్చారు. పాదయాత్రకు విశేషమైన స్పందన తీసుకొచ్చేందుకు ఆ పార్టీ నేతలు పూర్తి స్థాయిలో కసరత్తులు చేస్తున్నారు. జనసమీకరణ చేపడుతున్నారు. అదే సమయంలో యాత్రలోనూ స్వల్ప మార్పులు సైతం చేపట్టారు. మొదట నిర్ణయించిన ప్రకారం కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల్లోనూ పాదయాత్రలు ఉండేవి. ఇప్పుడు ఈ నియోజకవర్గాలకు మినహాయించారు. శింగనమల, అనంతరం, తాడిపత్రిలో ప్రవేశించి కర్నూలు జిల్లాకు యాత్ర చేరుకునే అవకాశముంది. వచ్చే వారంతో పాదయాత్ర జిల్లాలో ముగిసే అవకాశముంది. మొత్తంగా ఈ యాత్ర ఇప్పుడే ఎన్నికలు రానున్నాయా అన్నట్టుగా వాడివేడిగా మొదలయింది.

మామిడి రైతుల దిగాలు...!
మూడేళ్లుగా ఎగుమతులు లేక నష్టాలు

పూత సరిగారాని మామిడి చెట్లు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మూడేళ్లుగా మామిడి రైతులు డీలా పడిపోయారు. సరైన దిగుబడి, గిట్టుబాటు ధరలు లేక నష్టాలపాలయ్యారు. రెండేళ్ల కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ కారణంగా పండిన పంటకు ఎగుమతులు లేక తోటలకే వదిలేశారు. గత సంవత్సరమూ ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. గత ఏడాదిలో వర్షాలు అధికంగా కురవడంతో పూత బాగా వస్తుంది, కాయలు బాగా కాస్తాయని రైతులు ఎంతో ఆశపడ్డారు. వారు ఆశించిన దానికంటే భిన్నంగా పూత ఆలస్యంగా వచ్చింది. మంచు, వర్షం, వాతావరణంలో మార్పుల కారణంగా పూత చాలా వరకు నిలబడలేదు. దీంతో కాపు అంతంతమాత్రమే వచ్చింది. అధిక దిగుబడి సాధించడానికి, పూత రాలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు సూచనలిచ్చే అధికారులు లేకపోవడం శోచనీయం.

రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి రామగిరి, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కంబదూరు, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కుందుర్పి మండలాలు, ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు బెలుగుప్ప మండలాల్లో దాదాపు 5 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ప్రతి ఏటా దాదాపు రూ.150 కోట్లకు పైగా విలువైన దిగుబడులు జిల్లా నంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఈ సారి అధిక వర్షాలు, గాలులు, వాతావరణంలో మార్పులతో దిగుబడి తగ్గిపోవడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. మామిడి చెట్లకు పూత, పిందె, కాయ, కోత దశలు ఎంతో కీలకం. సాధారణంగా నవంబరు నుంచి పూత రావడం జరుగుతుంది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసం పూర్తయిన తర్వాత పూత వచ్చి దిగుబడి తక్కువ వచ్చినా ధర మాత్రం ఆశించినంతగా లేదని రైతులు, వ్యాపారస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మామిడి పంటకు కూడా ఈ క్రాప్ బుకింగ్ చేసి రైతులకు న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నాల్గవ రోజూ కొనసాగిన రిలే దీక్షలు

దీక్షలకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని, పట్టణ శివారు ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి నాల్గవ రోజుకు చేరాయి. శనివారం సిపిఎం అనుబంధ ప్రజా సంఘం ఐద్వా నాయకులు మద్దతు తెలుపుతూ దీక్షల్లో పాల్గొన్నారు. వారి దీక్షలకు సిపిఐ నియోజకవర్గ పట్టణ కార్యదర్శులు వీరభద్ర స్వామి, గోపినాథ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ ప్రజా సంఘం అధ్యక్షుడు ఆలం నవాజ్, కార్యదర్శి ఎం.మహేంద్ర, నాయకులు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. శిబిరం వద్దకు వెళ్లి దీక్షలు చేస్తున్న వారికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం నాయకులు ప్రజా సమస్యలపై రిలే దీక్షలు చేపట్టి నాలుగు రోజులు అయినా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించక పోవడం చూస్తే ప్రజల సంక్షేమం పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందన్నారు. మా భవిష్యత్తు నీవే జగన్ అనే కార్యక్రమంతో ఇంటింటా తిరుగుతున్న స్థానిక ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డికి ప్రజా సమస్యలపై చేస్తున్న రిలే దీక్షల శిబిరం కనవడలేదా అని ప్రశ్నించారు. దీక్షలో ఐద్వా మహిళా సంఘం కార్యదర్శి రంగమ్మ, నాయకురాల్లు లక్ష్మీబాయి, లలిత, కుమారి, లక్ష్మీదేవి, ఆదిలక్ష్మి, రేణుక, ఉషారాణి, కీర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు రాము నాయక్, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో నమ్మకం రెట్టింపు
ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి -అనంతపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల ప్రజల్లో నమ్మకం రెట్టింపు అయిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశామన్నారు. పథకాలు అందుతున్న తీరుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. శనివారం నగరంలోని 23వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ హరిత ఆధ్వర్యంలో చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి ఎమ్మెల్యే అనంత హాజరయ్యారు. వైసీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులతో కలిసి పలు కుటుంబాలను కలిసి ప్రజామద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు పాలనకు, జగన్ పరిపాలనకు మధ్య తేడాను వివరిస్తున్నామని తెలిపారు. ఇదే సమయంలో సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, ఇంకా ఏమైనా మార్పులు చేసుకోవాల్సి ఉందా? అని అడుగుతున్నామన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, భవిష్యత్‌లోనూ ఈ ప్రభుత్వం కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలన్నీ ఇలాగే కొనసాగాలని అందరూ కోరుతున్నారన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను తమ ఇళ్లకు తగిలించుకుంటున్నారని చెప్పారు. ఈనెల 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తమ పార్టీ గహ సారథులు, కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు వెళ్తారని తెలిపారు. ఇక నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ ప్రసంగిస్తున్న తీరుపై ఎమ్మెల్యే అనంత మండిపడ్డారు. అసత్య ఆరోపణలు చేస్తూ లోకేష్ ముందుకు వెళ్తున్నారన్నారు. లోకేష్ తండ్రి చంద్రబాబు 14 ఏళ్ల సిఎంగా పని చేశారని, లోకేష్ మంత్రిగా కూడా ఉన్నారని.. ఇప్పుడు అందిస్తున్నట్లు నిజాయతీగా సంక్షేమ పథకాలను టీడీపీ పాలనలో ఎందుకు ఇవ్వలేదో జవాబు చెప్పాలన్నారు. కేవలం ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌ను విమర్శించడమే పనిగా పాదయాత్ర కొనసాగుతోందన్నారు. ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక ప్రతిపక్షాలన్నీ కలవాలని ప్రయత్నిస్తున్నారని, ఎన్ని కుట్రలు పన్నినా 2024లో మరోసారి వైసిపి విజయం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెసిఎస్ క్లస్టర్ 2 కన్వీనర్ చింతకుంట మధు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వాలంటీర్లపై ఉందని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. శనివారం నార్పల మండల కేంద్రంలోని నాలుగు సచివాలయాల్లో, గూగూడు, బండ్లపల్లి, పప్పూరు గ్రామ సచివాలయాల్లోని వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. నాలుగేళ్ల వైసిపి పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అందించిన లబ్ధి గురించి వాలంటీర్లు ప్రజలకు వివరించాలన్నారు. 2024లో మరోసారి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మధ్యవర్తులు లేకుండా సంక్షేమ పథకాలను వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా అందే విధంగా చేసిన ఏకైక సిఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నార్పల సత్యనారాయణ రెడ్డి, ఎంఐఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్, మండల కన్వీనర్ నిట్టూరు రఘునాథరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్ పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ హరిత రాజగోపాల్, ఎంపిపి నాగేశ్వరావు, సర్పంచి మన్నీల సుప్రియ, ఉప సర్పంచి గవ్వల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని గడేకల్, ఎన్.తిమ్మాపురం గ్రామాల్లో సర్పంచి సుశీల ఉమాశంకర్, ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లతో కలిసి ఇంటింటా సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల అనుమతితో డోర్ స్టిక్కర్లు, ఫోన్ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఓబులేసు, నాయకులు కరణం భీమిరెడ్డి, హంపయ్య, ఎర్రన్న, చిన్న తిమ్మన్న, జయరాముడు, గౌస్, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలంలోని పలు గ్రామాల్లో వైసిపి నాయకులు జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పొందిన లబ్ధిని వివరించారు. జెడ్పిటిసి మమత, త్రిలోకనాథరెడ్డి, దుద్దేకుంట రామాంజనేయులు, సింగిల్ విండో అధ్యక్షులు శివలింగప్ప, జి శ్రీనివాసులు, మండల కన్వీనర్ పి.శ్రీనివాసులు, కరుణాకర్, పూల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న పోతుల నాగరాజు

బిసి అభ్యర్థిని సిఎంగా ప్రకటించాలి
ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు

ప్రజాశక్తి -అనంతపురం

రాజకీయ పార్టీలు బిసి అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటించాలని రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు డాక్టరు పోతుల నాగరాజు డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం పేరుతో బిసిలకు మోసం తప్ప న్యాయం ఎక్కడ జరుగుతోందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అధికారం కోసం పాదయాత్ర లు చేపడుతున్న మీరు, అధికారంలోకి వచ్చాక ఎవరి అభివృద్ధి కోసం పనిచేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు 56 శాతం మంది ఉన్న బిసిల ఓట్ల కోసమే ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రతి పదవికి ఒక ధర నిర్ణయించి కులాల మధ్య బేరాలు నిర్ణయిస్తున్నారన్నారు. బీసీ కులాల మధ్య విభేదాలు సృష్టిస్తూ పబ్బం గడుపుతున్నారు. ఈ మోసాలను గమనించాలని రాష్ట్రంలోని బిసి కులాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ రాజకీయ పార్టీల తీరు వల్ల రాష్ట్రంలో చదువుకున్న బిసి యువతకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. గౌరవంగా బతకడానికి ఏ ఒక్క అవకాశం లేకుండా చేశారన్నారు. ఇప్పుడు మరోసారి తామే బిసిలకు న్యాయం చేశామని, చేస్తామని పోటీ పడి ప్రకటనలు ఇస్తున్నారన్నారు. బిసి నాయకులు వారి మోచేతి నీళ్ల తాగుతూ ఆ పార్టీల అజెండాతో మాట్లాడుతూ బిసిల నడ్డి విరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఒక్కసారి అయినా ముఖ్యమంత్రి పదవిని బీసీలకు కేటాయించాలని, ప్రతి పార్లమెంట్ పరిధిలో 2 అసెంబ్లీ స్థానాల్లో బిసిలకు అవకాశం ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం రాయలసీమ జిల్లాల ముఖ్య నేతల సమావేశాన్ని ఈ నెల 23న అనంతపురంలో నిర్వహిస్తామని చెప్పారు. మే 14వ తేది ఉత్తర ఆంధ్ర జిల్లాల ముఖ్య నేతల సమావేశం విశాఖపట్నంలో, మే 28వ తేది కోస్తాంధ్ర జిల్లాల ముఖ్యనేతల సమావేశం విజయవాడలో ఏర్పాటు చేస్తామని చెప్పారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి,-యాడికి

క్యాన్సర్ బాధితుడికి దాతలు ఆర్థిక సాయం చేశారు. స్థానిక కొండకింద వీధిలో నివాసముంటున్న మహబూబ్ పీరా సాహెబ్ కొన్ని నెలలుగా మూత్రాశయ వ్యాధితో ఇబ్బందులు పడుతున్నాడు. శుక్రవారం యాడికి వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు రూ.10 వేలు అందజేశారు. శనివారం తాడిపత్రి అక్షర రిపోర్టర్ అబ్దుల్ రూ.5 వేలు బాధిత కుటుంబీకులకు అందించాడు. యాడికి విశాలాంధ్ర రిపోర్టర్ ఫరూక్ రూ.వెయ్యి బాధితుడి కూతురు సదాగ్నికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ శివప్రసాద్, అక్షర హుస్సేన్, సూర్య ఆలూ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటోను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం
ఇద్దరు వ్యక్తులు మృతి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన ఆత్మకూరు మండల కేంద్రంలోని కళ్యాణదుర్గం-అనంతపురం ప్రధాన రహదారిలో శనివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. కళ్యాణదుర్గం మండలం గొల్ల గ్రామానికి చెందిన సతీష్ (25), ఆనంద్ ఆటోలో గొర్రెలను వేసుకుని వాటిని విక్రయించేందుకు అనంతపురం మార్కెట్‌కు బయలుదేరాడు. ఆత్మకూరు మండల కేంద్రం వద్ద ఆటోను ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సతీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. 8 గొర్రెలు చనిపోయాయి. ఆనంద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని 108 సాయంతో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆనంద్‌ను కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. ఆత్మకూరు ఎఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-గుత్తి

మద్యం మత్తులో మాముదూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. మాముదూరు గ్రామానికి చెందిన రామాంజినేయులు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా వ్యాధి నయంకాలేదు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన రామాంజనేయులు మద్యం మత్తులో ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడివున్న అతన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గన్నెవారిపల్లి-2 ఎంపిటిసిపై దాడి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఓ రాజకీయ పార్టీకి చెందిన యువకులు కొందరు గన్నెవారిపల్లి-2 ఎంపీటీసీ సగర రవికుమార్‌పై శుక్రవారం రాత్రి దాడిచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాలిల మేరకు గన్నెవారిపల్లి కాలనీలో నివాసం ఉంటున్న ఎంపీటీసీ సగర రవికుమార్ శుక్రవారం రాత్రి కాలనీలోని ఓ హోటల్ వద్దకు చపాతీ కొనుగోలు చేసేందుకు వచ్చాడు. అదే సమయంలో పక్కనే ఉన్న ఓ కూల్ డ్రింక్ షాపు వద్దకు వచ్చిన రాజశేఖర్ రెడ్డి, నాగప్పలతో పాటు మరో ముగ్గురు రవికుమార్‌ను కులం పేరుతో దూషిస్తూ కర్రలతో దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో రవికుమార్ కుడి చేయి విరిగింది. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రవికుమార్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. తాను బీసీ కులానికి చెందిన వాడినని, అభివృద్ధి చెందడం ఓర్చుకోలేకే కొందరు తనపై దాడికి పాల్పడ్డారని ఎంపీటీసీ సగర రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

గడ్డివామి దగ్ధం
రూ.50 వేలు నష్టం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివామి దగ్ధమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొందలదిన్నె గ్రామం దళితవాడకు చెందిన నాగ సుబ్బరాయుడుకు చెందిన గడ్డి వామికి గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన నిప్పు రవ్వలు గాలికి ఎగిరి వచ్చి గడ్డివామి మీద పడడంతో నిప్పు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. స్థానికుల సమాచారంతో తాడిపత్రి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి : మండలంలోని రాయలచెరువు లీలావతి వృద్ధాశ్రమంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు యాడికి మారినీళ్ల భాస్కర్ తెలిపారు. ఎం.యేసయ్య కుమారుడు ప్రశాంత్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు పరిమి కృష్ణవేణి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

కంపోస్టు యార్డును పరిశీలించిన విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలోని బళ్లారి రోడ్డు పక్కన ఉన్న మున్సిపల్ కంపోస్ట్ యార్డును ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. సోమవారం రాత్రి కంపోస్ట్ యార్డులో చెత్తకు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. మరుసటి రోజు ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయినప్పటికీ బాగా ఎండిపోయిన చెత్త లోపల వేడి ఉండి పొగ వస్తూనే ఉంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాపు రాయదుర్గంతో పాటు కళ్యాణదుర్గం, కర్ణాటక రాష్ట్రంలో మలకాల్మూరు నుంచి ఫైర్ ఇంజన్లను తెప్పించి నిప్పును, పొగను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు తిరిగి వ్యాపించకుండా చెత్తపై నీరు చల్లించారు. జెసిబి సాయంతో చదును చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, తహశీల్దారు మారుతి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర యాదవ్, వార్డు సభ్యులు డిష్ గోవింద తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేష్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డిలపై చేసిన వ్యాఖ్యలపై వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. నారా లోకేష్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. శింగనమల నియోజకవర్గం లోని చెరువులను నీటితో నింపిన ఘనత ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికే దక్కుతుందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేపై లోకేష్ విమర్శలు చేయడం సరికాదన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక లోకేష్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత, సహకార సంఘం అధ్యక్షులు గువ్వల పెద్దవెంకటరెడ్డి, జడ్పీటీసీ భాస్కర్, సర్పంచి పార్వతి, జేసీఎస్ కన్వీనర్ పసులూరు బయపరెడ్డి, పూలనారాయణ స్వామి, చికెన్ నారాయస్వామి, ముత్యాలు శీనా, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నార్పల : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డిలపై నారా లోకేష్ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని వైసిపి నాయకులు హితవు పలికారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఐఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ నిట్టూరు రఘునాథరెడ్డి, జెడ్పి వైస్ ఛైర్మన్ నగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు, సింగిల్ విండో ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుల్లాయప్ప మాట్లాడారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదువుతూ అవాస్తవాలు మాట్లాడడం లోకేష్‌కు తగదన్నారు. ఇది ఆయన అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. దళిత రిజర్వేషన్ నియోజకవర్గంలో మీ పార్టీలో ఒక దళిత మహిళలకు ఏమాత్రం ప్రాధాన్యత ఇచ్చారో తెలుసుకొని మాట్లాడాలని హితవుపలికారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు సబీరా, శేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి రాజకుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైసిపి నాయకులు